కథ

# మిత్రనష్టం

సరసి

‘‘తోచీ తోచనమ్మ తోడికోడలు పుట్టింటికెళ్లిందట. ఏ పనీ లేనపుడు మనిల్లే గుర్తుకొస్తుంది కావును. ఇదిగో మిమ్మల్నే. మీ చిత్తుగాడు గారొచ్చారు!’’ అంది వెంకటలక్ష్మి బెడ్రూమ్‌లో బట్టలిస్త్రీ చేసుకుంటున్న భర్త భద్రాద్రి దగ్గరకొచ్చి.



"వచ్చేం, ఆదివారమని ఈవేళ చాలా పనులు పెట్టుకున్నానే!" అన్నాడతడు గుండెల మీద చెయ్యి వేసుకుంటూ.


చిదానందం అలియాస్ చిత్తుగాడు గారికి ఆదివారాలు, సెలవులే కాదు, ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా మిత్రుడింటికొచ్చి వాల్తాడు. "స్నేహం అంటే అదీ!" అని ముచ్చటపడుతూ వుంటారు చూసినవాళ్లు. కాని, 'అసలు బాధ భరించేవాళ్లది' అంటుంది వెంకటలక్ష్మి. అది ఆమె మాటల్లోనే వినాలి.

"తనది కాకపోతే తాడిచెట్టుకెదురు డేకమన్నాట్ట! చూసే వాళ్లకేం తెలుస్తుంది చేసే వాళ్ల బాధ? పొద్దున్నే వచ్చేసి, ఇక్కడే కూచుండిపోతే ఇక మా పన్లేం కావాలి? ఈ మహానుభావుడే క్షణాన్నయినా దాపురించొచ్చని కాఫీ టిఫిన్లే కాదు బియ్యం కూడా ఓ రెండు గ్లాసులెక్కువే పోస్తా. 'అలా విసుక్కోకే, మనతోబాటే వాడూనూ' అంటూ మా ఆయన గారు నాకు సర్దిచెప్పడానికే చూస్తారు గానీ, రావద్దని తన ప్రియాతి ప్రియమైన మిత్రుడికి చెప్పలేరు కదా! అయితే, ఓవిధంగా మా ఆయన కంటే నేనే కాస్త సుఖపడుతున్నానేమో ననిపిస్తుంది. ఏదో వండుకున్నది కాస్త ఈ చిత్తుగాడు గారి మొహాన కొట్టి నా పన్లు నేను చేసుకుంటాను వంటింట్లో. ఈయనకలా కాదు కదా. పక్కనే కూర్చుని కబుర్లు చెబుతూ ఆయనని, ఆయన చేసే చేష్టలని భరిస్తూ వుండాలి. కాఫీ తాగుతూ 'స్రుష్ స్రుష్' చప్పుళ్లు చేసినా, టిఫిన్లు తింటూ 'ప్చూ ప్చూ' శబ్దాలు చేసినా, నోటితో 'తుంపర సేద్యం' చేస్తూ మా ఆయన్ని తడిపేసినా భరించాల్సిందే. సోఫా మీదా, కిందా కర్వేపాకులు, మిరపకాయ ముక్కలూ పోస్తూవుంటే, వొళ్లు మండిపోతున్నా చూస్తూ వూరుకోవాల్సిందే. (తర్వాత శుభ్రం చేసుకోవడం నాకు తప్పదులెండి.) తిరిగే కాలూ తిట్టే నోరూ ఖాళీగా ఉండవంటారు కదా! తినేసి ఊరుకోకుండా ఆఫీసులోవాళ్లనో, కాలనీ వాళ్లనో లేక వాళ్ల బావమరుదులనో, మావగారినో తిట్టిపోస్తూ, 'వింటున్నావా' అంటూ మధ్యలో ఈయన్నో దెబ్బకొట్టి మరీ వినిపిస్తూ వుంటాడు. చచ్చినట్టు 'ఊ'కొడుతూ వినాల్సిందే కదా.

పొద్దున్నొచ్చిన వర్షం గాని, చుట్టం గాని ఆరోజుకి వదలరట! పొద్దున్నే సిద్ధమైన ఈ పెద్దమనిషి ఆరోజు మధ్యాహ్నం భోజనం చేసి, విశ్రమించి ఏ సాయంత్రమో, రాత్రో గాని మమ్మల్ని వదలడు. పోనీ, ఉన్నంతసేపూ ఊరికే ఉంటాడా? ఊహు, కాలు మీద కాలేసుక్కూచుని, నన్ను పిలిచి, 'ఏంటి చెల్లెమ్మా, ఇల్లు సర్దుకోలేదా? ఆ గూట్లో అవీ ఎవరన్నా వచ్చి చూస్తే బావుండదు! అదేవిటీ, గ్యాస్ సిలిండర్ ఈశాన్యంలో పెట్టారూ? అక్కడ బరువుండకూడదు, అరిష్టం!' అంటూ మంటెక్కేలా మధ్యమధ్యలో ఉచిత సలహాలు! నా పరిస్థితే చూడండి, మా ఆయనతోబాటు నేను కూడా ఉద్యోగం చేస్తున్నాను కదా. ఇంటి పని ఏం చేసుకున్నా ఆదివారాలే చేసుకోవాలి. వాకిట్లో అతిథిని కూచోబెట్టి, ఆయన మీదనే బూజులు దులుపుకోలేం కదా!

ఇంతేనా ఈ మనిషితో కష్టాలూ? మా ఇంట్లో సోఫా పక్కనే ఉంటుంది ఫోను. మా వారి బుర్ర తింటూ తింటూ, మధ్యలో తనకు గుర్తుకొచ్చిన ఫోన్లన్నీ ఇక్కణ్నుంచే చెయ్యడం! ఒకవేళ పొరబాటున ఒక నిమిషం ఖాళీ వచ్చి (అసలా ప్రశ్నే ఉత్పన్నం కాదు) ఇన్‌కమింగ్ ఫోనొస్తే, మా ఆయన లేచేలోగా తనే తీసి మాట్లాడెయ్యటం. దాంతో మా ఇంట్లో ఎవరో అతిథులున్నారని గ్రహించి, 'తర్వాత మాట్లాడతాంలే' అని అవతల నుంచి మా బంధువులు కూడా చెప్పాల్సినవి చెప్పకుండా వాయిదా వెయ్యడం. బాధల్లో ఇదొక భాగం!

మధ్యాహ్నం భోజనం చేశాక 'పోనీలే ఈ మహానుభావుడు కాసేపు పడుకుంటే మన పనులు మనం చేసుకోవచ్చు'ననుకుని మడత మంచం వాలిస్తే, మాకు ఏమాత్రం తొణగనివ్వకుండా ఘోరమైన గురక! మా పక్కింటివాళ్లు ఆమధ్య రోజంతా బోర్‌వెల్ వేసినపుడు కూడా మేమింత బాధ అనుభవించలేదు.




మెళకువ రాగానే, టీ ఇవ్వాలిగా! ఆ వేడి ఎలా పడుతుందో గాని, రెండు గుక్కల్లో దాన్ని పీల్చేసి, 'ఆదివారం మంచి సినిమా వేస్తాడు పెట్టుకోరా ఏం?' అంటూ టీవీ ఆన్ చేసేస్తాడు. నిజానికి ఆయన రాకపోతే సినిమాలు చూసే వాళ్లమేమో. ఆయనున్నపుడు పెడితే మూడు గంటలు ఖచ్చితంగా ఇక్కడే కూర్చుండిపోతాడని భయపడి, మా పిల్లలు కూడా సెలవు రోజుల్లో టీవీ పెట్టడం మానేసి, 'త్యాగపిల్లలు' (?) అయిపోతున్నారు. వాళ్ల పిచ్చిగాని, ఆయన ఇక్కడుండే సమయం ఎలాగూ ఉంటాడు.

మధ్యలో వాళ్లావిడ ఎప్పుడైనా ఫోన్ చేసి పిలుస్తుందేమో, ఈయన వెళతాడేమోనని కొత్తల్లో చాలా ఆశపడేదాన్ని. కాని 'ఈయన ఇంట్లోంచి వెడితే చాలురా భగవంతుడా' అని ఆమె కూడా అనుకుంటోందని తర్వాత తెలిసింది.

ఎట్టకేలకు ఏ రాత్రిపూటో మా మీద కరుణ కలుగుతుంది. 'పాపం మీ టైమంతా తినేశానో ఏంటో' అంటూ జాలిపడి, సెకండ్ షో వదిలే టైముకి మమ్మల్ని, మిగిలున్న మా జీవుల్ని కూడా వదిలిపెట్టి వెడతాడాయన. దీంతో సెలవొస్తోందంటేనే భయంగా వుంటోంది మాకు. ఏ జన్మలో ఎవరికి అపకారం చేశామో!"

కదిపితే చాలు, గోడంతా చెప్పుకుని, కొంగుతో కళ్లు తుడుచుకుంటుంది వెంకటలక్ష్మి.

***

చాలాకాలం గడిచింది. ఈ 'యావజ్జీవ కఠిన ఆతిథ్య శిక్ష'కు ఆ కుటుంబం దాదాపు అలవాటుపడిపోతున్న రోజుల్లో, ఓరోజు మధ్యాహ్నం ఆఫీసు నుంచి హడావుడిగా ఆటోలో ఇంటికొచ్చాడు భద్రాద్రి. 'బ్యాంకులో ఎంతుంది? అర్జంటుగా పాతికవేలు కావాలి. విషయం తర్వాత చెబుతాను' అంటూ భార్య ఇచ్చిన చెక్‌బుక్ తీసుకుని పరుగెట్టాడు. తర్వాత తెలిసింది వెంకటలక్ష్మికి. చిదానందానికి హఠాత్తుగా కడుపులో నొప్పి వచ్చిందట. వాళ్లావిడ అతడిని హాస్పిటల్లో చేర్చి, ఫోను చేస్తే భద్రాద్రి వెళ్లాడట. టెస్టులూ అవీ చేసి, 'అపెండిసైటిస్' అని తేల్చి, 24 గంటల్లో కనక ఆపరేషన్ చెయ్యకపోతే 'ఇంతే సంగతులు' అన్నార్ట.

తంతే పైస లేదని చిదానందం చేతులెత్తేశాడు. మొత్తం ఖర్చంతా భద్రాద్రి భరించక తప్పలేదు. "ఆ డబ్బులు మళ్లీ వస్తాయో చస్తాయో తెలియదు గానీ, చిత్తుగాడు హాస్పిటల్లో ఉన్నన్ని రోజులూ ఆ ఖర్చు మనమే పెట్టుకోవాలి!" అన్నాడు భద్రాద్రి, భార్యతో.

ఎంతోకాలంగా వీరిద్దరినీ చూస్తున్న చుట్టుపక్కల ఇళ్లవాళ్లు ఈ సంఘటన తర్వాత వీరిని అభినందించకుండా ఉండలేకపోయారు. "స్నేహం అంటే మీదే భద్రాద్రి గారూ. ఈరోజుల్లో కూడా ఇలాంటి మిత్రులుంటారా అనిపిస్తోంది. మీ మిత్రుడికోసం మీరు చేస్తున్న సేవ, త్యాగం, ప్చ్, రియల్లీ గ్రేట్!" అన్నాడొకాయన చూడ్డానికొచ్చి కళ్లొత్తుకుంటూ.

"త్యాగమా నా శ్రాద్ధమా! వాడు రెండేళ్లక్రితం ఐదు లక్షలకి చిట్టీ పాడేడు. దానికి నేను ష్యూరిటీ సంతకం పెట్టాను. ఆ పాపానికి నా జీవితాంతం వాడిని భరించడమే కాదు, వాడికేం కాకుండా కూడా చూసుకోవాలి. లేకపోతే, నేను మునిగిపోవడం ఖాయం. ముందూ వెనకా ఆలోచించకుండా ష్యూరిటీ సంతకాలు పెట్టేవారికి ఇటువంటి శిక్షలు తప్పవని అనుభవం నేర్పిన పాఠం యిది! జీవితంలో 'మిత్రలాభం' సంగతేమో గానీ, 'మిత్రనష్టం' మాత్రం తెలిసొచ్చింది!" అన్నాడు భద్రాద్రి పెద్ద వేదాంతిలా.

★